APTEL/26/A4269

# అనంత సూర్య

www.ananthasurya.com తెలుగువార్త

ప్రచురణ : అనంతపురం / శ్రీ సత్యసాయి ఎడిటర్ : సి హరికృష్ణ ఆదివారం 19, జూలై 2026 సంపుటి: 01 సంచిక :52 పేజీలు : 04 వెల: 2-00/-



## విక్రమ్-1 విజయంపై మోదీ హర్షం

- స్కైరూట్ వ్యవస్థాపకులతో ఫోన్‌లో మాట్లాడిన ప్రధాని
- భారత్ స్వయం సమృద్ధికి నిదర్శనమని ప్రశంస
- ప్రైవేటు అంతరిక్ష రంగానికి కొత్త ఊపునిచ్చిన విజయం

శ్రీహరికోట, జూలై 18: హైదరాబాద్‌కు చెందిన స్కైరూట్ ఏరోస్పేస్ సంస్థ అభివృద్ధి చేసిన విక్రమ్-1 ఆర్బిటల్ రాకెట్ విజయవంతమైన ప్రయోగంపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఉపగ్రహాలు, పేలోడ్లు విజయవంతంగా నిర్ణీత కక్ష్యలోకి చేరిన అనంతరం స్కైరూట్ సంస్థ సహ వ్యవస్థాపకులు పవన్ కుమార్ చందన, నాగ భరత్ డాకాతో ఫోన్‌లో మాట్లాడి అభినందనలు తెలిపారు. ఈ విజయం భారత అంతరిక్ష రంగంలో స్వయం సమృద్ధికి నిదర్శనంగా నిలుస్తుందని పేర్కొన్నారు. రాకెట్ ప్రయోగ సమయంలో శ్రీహరికోటలోని మిషన్ కంట్రోల్ కేంద్రంలో ఉన్న స్కైరూట్ బృందంతో మాట్లాడిన ప్రధాని, విక్రమ్-1 విజయంతో దేశానికి గర్వకారణమైన ఘట్టం ఆవిష్కృతమైందన్నారు. మిషన్ ఆగమన్ మరింత విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూ, భారత అంతరిక్ష ప్రయాణంలో ఇది చారిత్రక మైలురాయిగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. విక్రమ్-1 రాకెట్‌ను పూర్తిగా భారతదేశంలోనే రూపకల్పన చేసి అభివృద్ధి చేసినట్లు స్కైరూట్ సంస్థ ప్రతినిధులు ప్రధానికి వివరించారు. ప్రయోగానికి ముందు ప్రధాని రాసిన 'వందేమాతరం' సందేశంతో కూడిన లేఖ కూడా విజయవంతంగా కక్ష్యలోకి చేరినట్లు సంస్థ ప్రధాన కార్యనిర్వాహక అధికారి పవన్ కుమార్ చందన తెలిపారు. ఈ విజయం తమ బృందానికి మరింత ఉత్సాహాన్ని ఇచ్చిందన్నారు.

## 2027 నాటికి పోలవరం పూర్తి చేస్తాం

- వంద శాతం పనులు పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడి
- నదుల అనుసంధానంతో కరవు రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యమని స్పష్టం
- 'తల్లికి వందనం' పథకం ఈ నెల నుంచే ప్రారంభమవుతుందని ప్రకటన




గుడివాడ, జూలై 18 : ఆంధ్రప్రదేశ్ జీవనాడిగా భావిస్తున్న పోలవరం ప్రాజెక్టును 2027 నాటికి వంద శాతం పూర్తి చేసి ప్రజలకు అంకితం చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. కృష్ణా జిల్లా గుడివాడలో నిర్వహించిన 'స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర' బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ పోలవరం నిర్మాణ పనులను కూటమి ప్రభుత్వం అత్యంత వేగంగా ముందుకు తీసుకెళుతోందని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి నీటి వనరులే ప్రధాన ఆధారమని పేర్కొన్నారు. పట్టిసీమ ప్రాజెక్టును గతంలో కేవలం 12 నెలల రికార్డు సమయంలో పూర్తి చేసి కృష్ణా డెల్టాకు సాగునీరు అందించిన విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. అదే స్ఫూర్తితో పోలవరం నిర్మాణాన్ని కూడా వేగవంతం చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలోని ప్రధాన నదులన్నింటినీ అనుసంధానం చేయడం ద్వారా భవిష్యత్తులో కరవు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని వెల్లడించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం కట్టుబడి ఉందని చంద్రబాబు పేర్కొన్నారు. అందులో భాగంగా ఈ నెల నుంచే 'తల్లికి వందనం' పథకాన్ని ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. ప్రతి హామీని దశలవారీగా అమలు చేస్తూ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటామని తెలిపారు. కృష్ణా జిల్లాకు చారిత్రక, సాంస్కృతిక ప్రాధాన్యం ఎంతో గొప్పదని ముఖ్యమంత్రి అన్నారు. అభివృద్ధి కార్యక్రమాల్లో కూడా ఈ జిల్లాను ముందంజలో నిలిపేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు సాగుతోందన్నారు.



## కల్తీలపై కఠిన చట్టం అమలు చేయండి : సీఎం

- ఆహార, ఔషధ కల్తీల నిరోధానికి సమగ్ర చట్టం రూపొందించాలని సీఎం ఆదేశం
- విజిల్ బ్లోయర్ వ్యవస్థ, టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలని సూచన
- విదేశీ విధానాల అధ్యయనం చేసి బిల్లును సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశాలు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్, జూలై 18 : ఆహార పదార్థాలు, ఔషధాల్లో కల్తీలను అరికట్టేందుకు కఠినమైన తెలంగాణ ఆహార కల్తీ, ఔషధ నియంత్రణ చట్టాన్ని రూపొందించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎంసీఆర్‌హెచ్ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో కల్తీల వల్ల ప్రజారోగ్యంపై పడుతున్న ప్రభావంపై విస్తృతంగా చర్చించారు.

## పవన్‌ను పరామర్శించిన లోకేష్



- శస్త్రచికిత్స అనంతరం ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న మంత్రి
- కనకదుర్గమ్మ చిత్రపటం, ప్రసాదం అందజేసిన నారా లోకేష్
- త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన ఐటీ, విద్యాశాఖ మంత్రి

హైదరాబాద్, జూలై 18 : కుడి భుజానికి శస్త్రచికిత్స చేయించుకున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ శనివారం సాయంత్రం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో పరామర్శించారు. పవన్ కల్యాణ్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విజయవాడ కనకదుర్గమ్మ చిత్రపటంతో పాటు అమ్మవారి ప్రసాదాన్ని నారా లోకేష్ పవన్ కల్యాణ్‌కు అందజేశారు. శస్త్రచికిత్స అనంతరం ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందో తెలుసుకుంటూ వైద్యులు సూచించిన జాగ్రత్తలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. భుజానికి తగిలిన గాయం, శస్త్రచికిత్స వివరాలపై పవన్ కల్యాణ్‌తో లోకేష్ మాట్లాడారు. వైద్యుల పర్యవేక్షణలో విశ్రాంతి తీసుకుని పూర్తి ఆరోగ్యంతో తిరిగి ప్రజాసేవలో పాల్గొనాలని ఆకాంక్షించారు. పరామర్శ సందర్భంగా ఇద్దరు నేతలు కొద్దిసేపు రాష్ట్రంలోని పలు అంశాలపై కూడా చర్చించినట్లు సమాచారం. పవన్ కల్యాణ్ ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగా ఉందని, వైద్యుల సూచనల మేరకు విశ్రాంతి తీసుకుంటున్నట్లు తెలిసింది. ఉప ముఖ్యమంత్రి త్వరగా కోలుకోవాలని పలువురు ప్రజాప్రతినిధులు, అభిమానులు, పార్టీ నాయకులు ఆకాంక్షిస్తున్నారు. ఆయన ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు వైద్యులు పర్యవేక్షణ కొనసాగిస్తున్నట్లు సమాచారం. ఈ పరామర్శ కార్యక్రమం స్నేహపూర్వక వాతావరణంలో జరిగింది. రాష్ట్ర ప్రజలకు సేవలందించే బాధ్యతల్లో తిరిగి త్వరలోనే పాల్గొనాలని ఆకాంక్షిస్తూ నారా లోకేష్ పవన్ కల్యాణ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.



## బొర్రమాంబ మైదానం ఆధునికీకరణ

- రూ.10 కోట్లతో క్రీడా మైదానం అభివృద్ధికి శ్రీకారం
- యువతకు అత్యాధునిక క్రీడా వసతులు కల్పించడమే లక్ష్యమని పల్లా శ్రీనివాసరావు
- నిర్ణీత గడువులో నాణ్యతతో పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం

విశాఖపట్నం, జూలై 18 : గాజువాకలోని బొర్రమాంబ టెంపుల్ గ్రౌండ్‌ను సుమారు రూ.10 కోట్ల వ్యయంతో అత్యాధునిక క్రీడా మైదానంగా అభివృద్ధి చేయనున్నట్లు గాజువాక శాసనసభ్యుడు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తెలిపారు. యువతకు మెరుగైన క్రీడా సదుపాయాలు కల్పించాలనే లక్ష్యంతో ఈ అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు వెల్లడించారు. మైదానం అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించిన పల్లా శ్రీనివాసరావు, క్రీడాకారులకు అవసరమైన అన్ని సౌకర్యాలను ఒకేచోట అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఆధునిక ప్రమాణాలతో మైదానాన్ని తీర్చిదిద్దడం ద్వారా స్థానిక యువతకు మెరుగైన శిక్షణ, సాధన అవకాశాలు కల్పించవచ్చని పేర్కొన్నారు. క్రీడా మౌలిక సదుపాయాల అభివృద్ధి యువతలో ప్రతిభను వెలికితీయడానికి ఎంతో దోహదపడుతుందని ఆయన అన్నారు. భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలకు క్రీడాకారులను సిద్ధం చేసేలా మైదానాన్ని అభివృద్ధి చేయాలని అధికారులకు సూచించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడవద్దని పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. నిర్ణీత గడువులో పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. పనుల అమలులో పారదర్శకత పాటిస్తూ నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. గాజువాక ప్రాంతంలో క్రీడా రంగానికి మరింత ప్రోత్సాహం అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని ఆయన పేర్కొన్నారు.

# నల్లమాడలో స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమం



♦ మొక్కలు నాటిన పంచాయతీ సెక్రటరీ దాదాసాబ్, హాస్పిటల్ డైరెక్టర్ డా. బుట్టి నాగభూషణం నాయుడు

నల్లమాడ, జూలై 18 అనంత సూర్య: సత్యసాయి జిల్లా పుట్టపర్తి నియోజకవర్గం నల్లమాడ మండల కేంద్రంలో ప్రతి నెల మూడో శనివారం నిర్వహించే స్వచ్ఛ ఆంధ్ర--స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎస్‌డబ్ల్యూఎంపీసీ (చెత్తతో సంపద తయారీ కేంద్రం) ఆవరణలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు సందేశం ఇచ్చారు. ఈ సందర్భంగా హాస్పిటల్ డైరెక్టర్ డా. బుట్టి నాగభూషణం నాయుడు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర--స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి కుటుంబం మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు ఇంటి పరిసరాలు, వీధులను పరిశుభ్రంగా ఉంచాలని, తడి చెత్త--పొడి చెత్తను వేర్వేరుగా అందించి పారిశుద్ధ్య నిర్వహణకు సహకరించాలని కోరారు. అడవుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. పారిశుద్ధ్య కార్మికులు పరిశుభ్రతతో పాటు మొక్కలు నాటి వాటిని సంరక్షించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛభారత్ మండల రిసోర్స్ కోఆర్డినేటర్ గంగాధర్, పంచాయతీ సెక్రటరీ దాదాసాబ్, శానిటేషన్ వర్కర్లు అలంక నరసింహులు, టీడీపీ నాయకుడు అగ్గి రాముడు, గంగాద్రి, గంగాదేవి, గాయత్రి, నారాయణమ్మ, చెన్నమ్మ, నాగలక్ష్మి, వాటర్‌మాన్ గంగాద్రి తదితరులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# బుల్లెట్ ట్రైన్ కారిడార్‌లో పుట్టపర్తికి చోటు కల్పించడం అభినందనీయం



♦ తెలుగు రాష్ట్రాలు- కర్ణాటక అనుసంధానానికి కొత్త ఊపు: బీజేపీ నేత ఎస్. విష్ణువర్ధన్ రెడ్డి

పుట్టపర్తి, జూలై 18 అనంత సూర్య: హైదరాబాద్‌ను కేంద్రంగా చేసుకుని ప్రతిపాదిత హై-స్పీడ్ రైలు (బుల్లెట్ ట్రైన్) కారిడార్లలో శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తికి చోటు కల్పించడం స్వాగతించదగ్గ పరిణామమని బీజేపీ సీనియర్ నేత ఎస్. విష్ణువర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్--చెన్నై, హైదరాబాద్-పుణే-ముంబై హై-స్పీడ్ రైలు కారిడార్లు దక్షిణ భారత అభివృద్ధికి కీలక మైలురాయిగా నిలుస్తాయని అన్నారు. ముఖ్యంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలను సమర్థవంతంగా అనుసంధానిస్తూ రాయలసీమకు ప్రాధాన్యం కల్పించడం అభినంద నీయమన్నారు .ప్రపంచ ప్రఖ్యాత ప్రశాంతి నిలయం ఉన్న పుట్టపర్తికి హై-స్పీడ్ రైలు అనుసంధానం కల్పించడం వల్ల ఆధ్యాత్మిక పర్యాటకం, విద్య, వైద్య సేవలు, వాణిజ్యం, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు మరింత విస్తరించే అవకాశం ఉందని తెలిపారు. దేశంలో ఆధునిక రవాణా మౌలిక సదు-పాయాల అభివృద్ధికి దూరదృష్టితో కృషి చేస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌లకు ఆయన అభినందనలు తెలిపారు. అలాగే ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుల అమలుకు సహకరిస్తున్న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వాలు, ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులను అభినందించారు. దాదాపు రూ. 1.5 లక్షల కోట్ల వ్యయంతో ప్రతిపాదిత ఈ హై-స్పీడ్ రైలు కారిడార్లు అమల్లోకి వస్తే మూడు రాష్ట్రాల మధ్య ప్రయాణ సమయం గణనీయంగా తగ్గడంతో పాటు పారిశ్రామిక అభివృద్ధి, ప్రాంతీయ వాణిజ్యం, పర్యాటకం, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలకు విశేష ఊతం లభిస్తుందని విష్ణువర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. వికసిత భారత్ లక్ష్య సాధనలో కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న ఇటువంటి అభివృద్ధి కార్యక్రమాలకు భారతీయ జనతా పార్టీ సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు.

# ప్రణాళిక బద్ధమైన కుటుంబం శ్రేయస్కరం

అనంతపురం, జులై 18 అనంత సూర్య : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో శనివారం ఉదయం ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ముగింపు కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి డిఎంహెచ్ఓ డా. వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. అలాగే వివిధ శాఖలకు చెందిన అధికారులు వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగ సిబ్బంది, నర్సింగ్, శ్రీ సత్యసాయి కాలేజీ విద్యార్థులు, పలు స్వచ్ఛంద సేవ సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగాడిఎంహెచ్ఓ డా. కట్టా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం జూలై 11వ తేదీన ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తున్నదని తెలిపారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కుటుంబ ఆరోగ్యం, సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా 8 రోజులపాటు అవగాహన సదస్సులు సమావేశాలు ర్యాలీలు నిర్వహించడం జరిగిందన్నారు. పిల్లల మధ్య ఎడమ పాటించడానికి స్త్రీ, పురుషులకు అవసరమైన గర్భనిరోధక మాత్రలు చికిత్సలు ఇతర




సాధనాలు ఉచితంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో, అన్ని ప్రభుత్వాసుపత్రిలో ఉచితంగా లభిస్తాయన్నారు. ప్రకృతి విధానాలు కూడా తోడ్పడతాయని, బిడ్డకు తల్లిపాలు ఇవ్వడం కూడా ఒక ప్రకృతి ఎడమ విధానంగా ప్రజల్లోకి తీసుకు వెళ్లాలన్నారు. . మహిళా సాధికారత సాధించడం, బాల్య వివాహాలు నిరోధించడం , మహిళా స్వయం నిర్ణయ అధికారం తో దేశ ప్రగతి సాధ్యమని వివరించారు. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలుక్షేత్రస్థాయిలో వైద్య ఆరోగ్యశాఖతోపాటు మహిళా శిశు సంక్షేమ శాఖ, పంచాయతీరాజ్ , స్వచ్ఛంద సేవా సంస్థలు మెప్మా, విద్యాశాఖ, స్వ-యం సహాయక బృందాలు, సమాచార పౌర సంబంధాలు తదితర శాఖల సమన్వయం తో కృషి చేస్తే ఆరోగ్యవంతమైన సంతోషకరమైన కుటుంబాన్ని నిర్మించు కోవడంలో భాగస్వాములు అవుతామన్నారు. సర్వజన ఆస్పత్రి సూపర్డెంట్ డాక్టర్ మల్లేశ్వరి పాల్గొని కుటుంబ ప్రణాళికలో మహిళా పాత్ర ప్రాముఖ్యత వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ సాజిదా బేగం, జిల్లా సమాచార, పౌర సంబంధాల అధికారి బాలకొండయ్య, ఆరోగ్య కార్యక్రమాల అధికారులు డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ ప్రసన్న భారతి, జాతీయ ఆరోగ్య మిషన్ అధికారి డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ సునీత, జిల్లా మాస్ మీడియా అధికారి ఈ. నాగరాజు, డిప్యూటీ డెమో లక్ష్మీనారాయణ, ఆరోగ్య విద్యా అధికారులు గంగాధర్, వేణు, విజయ భాస్కర్, వెంకటేశ్వర,కిరణ్ న్యాయ సలహాదారు ఆషా రాణి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీచైతన్య పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

## ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌కు ఏఐఎస్బీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాపిరెడ్డిపల్లి పృథ్వి

అనంతపురం, జులై 19 అనంత సూర్య : నిర్మాణంలో ఉన్న భవనంలో తరగతులు నిర్వహిస్తూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న శ్రీచైతన్య విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్బీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాపిరెడ్డిపల్లి పృథ్వి డిమాండ్ చేశారు. శనివారం అనంతపురం అర్బన్ నియోజకవర్గం కార్యాలయంలో ప్రజా సమస్యల వేదిక కార్యక్రమంలో భాగంగా పాపిరెడ్డిపల్లి పృథ్వి.. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పాపిరెడ్డిపల్లి పృథ్వి మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనలను పాటించకుండా ఇష్టారాజ్యంగా విద్యాసంస్థలు నిర్వహిస్తున్న శ్రీచైతన్యపై చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో శ్రీచైతన్య విద్యాసంస్థలు 8 బ్రాంచులున్నాయని, ఏ ఒక్క పాఠశాలలో కూడా ప్రభుత్వ నిబంధనలను పాటించకుండా ప్రభుత్వం నిర్ణయించిన ఫీజుకంటే అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థులను, వారి తల్లిదండ్రులను మానసికంగా ఆర్థికంగా



ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. అంతేకాకుండా నగరంలో ఉన్న పిస్తా హౌస్ హోటల్ సమీపంలో శ్రీ చైతన్య పాఠశాల భవనం నిర్మాణంలో ఉందని, ఆ భవనంలో తరగతులు నిర్వహిస్తూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని పేర్కొన్నారు. భవనం నిర్మాణంలో ఉన్న ఆ భవనానికి విద్యాశాఖ అధికారులు అనుమతి ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. నిర్మాణంలో ఉన్న ఆ భవనంపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో శ్రీ చైతన్య విద్యాసంస్థలు నయా దందా చేస్తూ రాజ్యాంగాన్ని చట్టాన్ని ఖూనీ చేస్తూ విద్యాసంస్థలు నిర్వహిస్తున్నారనిన్నారు. తక్షణమే శ్రీచైతన్య విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేకు కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్బీ నాయకులు మంజుల విష్ణు, గౌతమ్ కుమార్, ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

# కేజీబీవీ పాఠశాలను తనిఖీ చేసిన అధికారులు.



పుట్టపర్తి /కొత్తచెరువు, జులై 18, అనంత సూర్య: పుట్టపర్తి మండల పరిధిలోని జగరాజుపల్లి కేజీబీవీ పాఠశాలను మండల ప్రత్యేక అధికారి నాగరాజు, డిప్యూటీ ఎంపీడీవో శంకర్ రెడ్డి శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు విద్యార్థుల వసతిగృహము, భోజనశాల, పాఠశాల సిబ్బందిని, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో భోజన వసతులను, నాణ్యతను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెనూ ప్రకారం విద్యార్థులకు ఆహారము అందజేయాలని, వారికి అందించే కాస్మెటిక్స్, మరియు ఇతర వస్తువులను సక్రమంగా అందించాలని, సూచించారు. ఎలాంటి లోపాలు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ సందర్భంగా వారితోపాటు పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కొత్తచెరువు మండలంలో మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి విస్తృత పర్యటన

♦ బాధిత కుటుంబాలకు పరామర్శ.. పార్టీ అండగా ఉంటుందని భరోసా



కొత్తచెరువు, జూలై 18 అనంత సూర్య: పుట్టపర్తి మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి శనివారం కొత్తచెరువు మండలంలోని పలు గ్రామాల్లో విస్తృతంగా పర్యటించారు. ఇటీవల మరణించిన వారు, ప్రమాదాలకు గురైన వారు, అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులను వారి నివాసాలకు వెళ్లి పరామర్శించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. మండల కేంద్రానికి చెందిన జయరాం కుటుంబంపై



జరిగిన దాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. గాయపడిన జయరాం, ఆయన కుమారుడు సుదర్శన్‌ను పరామర్శించి పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అలాగే టీడీపీ అక్రమ కేసులకు గురైన బోయ యల్లప్ప కుటుంబాన్ని పరామర్శించి పూర్తి మద్దతు ప్రకటించారు. కే. లోచర్ల, మరకుంటపల్లి, దంట్లపల్లి, వేములేటిపల్లి, కనిశెట్టిపల్లి, కొత్తచెరువు గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన పలువురి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రమాదాలు, అనారోగ్యంతో బాధపడుతున్న పలువురిని పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ పర్యటనలో మండల వైఎస్సార్సీపీ నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కొత్తచెరువులో తాగునీటి ఎద్దడి.. మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డికి మహిళల వినతి



కొత్తచెరువు, జూలై 18 అనంత సూర్య: కొత్తచెరువు మండల కేంద్రంలోని బసవన్నకట్ట, పెద్ద మసీద్ ప్రాంతాల్లో తీవ్ర తాగునీటి సమస్య నెలకొన్న నేపథ్యంలో స్థానిక మహిళలు శనివారం పుట్టపర్తి మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. నీటి కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, వెంటనే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకునేలా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని మహిళలు కోరారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో తాగునీటి సమస్య లేకుండా మౌలిక సదుపాయాలు కల్పించారని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో నీటి సమస్య తీవ్రంగా మారిందని వారు పేర్కొన్నారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని స్థానిక ఎమ్మెల్యే, సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి బసవన్నకట్ట, పెద్ద మసీద్ ప్రాంతాల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని మహిళలు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ రెడ్డి సమస్యను పరిష్కరించే దిశగా తన వంతు కృషి చేస్తానని వారికి భరోసా ఇచ్చారు.

# 2 ఏళ్లలో.. రూ.200 కోట్లతో అభివృద్ధి చేశాం



- త్వరలో టిడ్కో ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేస్తాం
- టిడ్కో ఇళ్లను అర్హులైన లబ్ధిదారులకు అందజేస్తాం
- ప్రజా దర్బార్‌లో ఎమ్మెల్యే దగ్గుపాటి

**అనంతపురం, జులై 19 అనంతసూర్య :**

అనంతపురం సమీపంలోని ఆలమూరు లేఅవుట్, టిడ్కో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేస్తామని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. అర్బన్ టిడిపి కార్యాలయంలో ఆయన ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ కాలనీలకు చెందిన ప్రజలు తమ సమస్యలపై అర్జీలు ఇచ్చారు. ప్రతి ఒక్కరితో ఓపికగా మాట్లాడుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొన్ని సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారం చూపించారు. మరికొన్ని సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు 50సార్లు ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ఇందులో 1147 అర్జీలు వచ్చాయని.. వీటిలో 90 శాతానికి పైగా పరిష్కారం చూపించినట్లు తెలిపారు. మరి కొన్ని వివిధ దశల్లో ఉన్నట్లు వివరించారు. ఎక్కువగా ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన అర్జీలు వస్తున్నాయన్నారు. గత ప్రభుత్వంలో ఒక సెంటు స్థలం ఇచ్చి ఇళ్ల నిర్మాణం చేస్తామని మాటలు చెప్పి మోసం చేశారన్నారు. ఇప్పుడు వాటిని పూర్తి చేసే బాధ్యత తమపై ఉందని, త్వరలోనే ఆలమూరు లేఔట్‌లో 6వేల ఇళ్ల నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. గత తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలో టిడ్కో ఇళ్లను పూర్తి చేస్తే.. వైసీపీ ప్రభుత్వంలో కేవలం రంగులు మార్చి లబ్ధిదారుల జాబితాలను మార్చుకున్నారు. త్వరలోనే టిడ్కో ఇళ్లను కూడా అర్హులైన లబ్ధిదారులందరికీ ఇస్తామని స్పష్టం చేశారు. గత ఐదేళ్లలో నగరంలో ఒక్క అభివృద్ధి కార్యక్రమం కూడా చేయలేదన్నారు. కేవలం రూ.350 కోట్లతో.. అందునా తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలో తీసుకొచ్చిన నిధులతో ప్రధాన రహదారి నిర్మించారన్నారు. అది కూడా వంకర టింకరగా నిర్మాణాలు చేపట్టారని విమర్శలు చేశారు. ఈ రెండేళ్లలోనే అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో రూ.200 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేసినట్లు వివరించారు. 25 నుంచి 30 ఏళ్లుగా ఉన్న రోడ్లు, డ్రైనేజీల సమస్యలకు పరిష్కారం చూపించినట్లు వివరించారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో వ్యవస్థల్ని అస్తవ్యస్తం చేసి వెళ్లిపోతే ముఖ్యమంత్రి చంద్రబాబు తన అనుభవంతో కేవలం ఏడాదిలోపే పరిస్థితిని గాడిలో పెట్టా రన్నారు. ఇప్పుడు అమరావతి, పోలవరం సహా రాష్ట్రంలో అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. అనంతపురం జిల్లాలోనే లక్ష కోట్లకు పైగా పరిశ్రమలు తీసుకొచ్చారన్నారు. అమరావతిలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని, 2029కల్లా అమరావతి ఎలా ఉండబోతుందో ప్రజలు చూస్తారని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు. కార్యక్రమంలో మాంసాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ చంద్రదండ ప్రకాష్ నాయుడు, టిడిపి నగర అధ్యక్షుడు సుధాకర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ అహ్మద్, పలు కార్పొరేషన్ డైరెక్టర్లు రంగాచారి, బొమ్మినేని శివ, కడియాల కొండన్న, పరమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



# నీట్ ఫలితాల్లో.. తేజ ప్రభంజనం



ఆల్ ఇండియా ర్యాంకులో టి.నవనీత (1039), ఎస్.సిరివెన్నెల (2923) విద్యార్థులను, తల్లిదండ్రులను అభినందించిన కళాశాల యాజమాన్యం



**అనంతపురం, జులై 19 అనంతసూర్య :**

జాతీయ స్థాయి వైద్య విద్యా ప్రవేశ పరీక్ష (నీట్) ఫలితాల్లో ప్రముఖ విద్యాసంస్థ 'తేజ కళాశాల' సరికొత్త చరిత్ర సృష్టించింది. జాతీయ స్థాయిలో అత్యంత కఠినమైన పోటీని ఎదుర్కొని, అసాధారణ ప్రతిభతో ఆల్ ఇండియా టాప్ ర్యాంకు లను కైవసం చేసుకుని తన విజయకేతనాన్ని ఎగురవేసింది. శుక్రవారం విడుదలైన ఈ ఫలితాల్లో తేజ కళాశాల విద్యార్థులు సాధించిన ర్యాంకులు విద్యావిభాగంలో సరికొత్త ప్రభంజనాన్ని సృష్టించాయి. ఫలితాల్లో టీ.నవనీత ఆల్ ఇండియా 1039వ ర్యాంక్, సిరివెన్నెల ఆల్ ఇండియా 2923వ ర్యాంక్ సాధించి జిల్లా టాప్ ర్యాంక్ లు సాధించారు. అంతే కాకుండా 50 వేల లోపు 8 మంది, లక్షలోపు 15 మంది అత్యుత్తమ ర్యాంకులు సాధించి ఎంబీబీఎస్, బీడీఎస్ లాంటి వైద్య విద్య సీట్లు సాధించబోతున్నారు.

ఈ సందర్భంగా తేజ విద్యాసంస్థల డైరెక్టర్ తెజేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. జూనియర్ కళాశాల స్థాపించిన మొదటి సంవత్సరం నుంచి వరుసగా ప్రతి ఏడాది నీట్, జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్ ఫలితాల్లో జాతీయ స్థాయిలో అత్యుత్తమ ర్యాంక్‌లు క్రమం తప్పకుండా ప్రతి ఏటా సాధిస్తూ అనంతపురం జిల్లా కీర్తి ప్రతిష్టలను జాతీయ స్థాయిలో ఇనుమడింపజేస్తున్న విద్యార్థులకు, మా మీద నమ్మకం ఉంచి ఇంతటి ఘన విజయాలకు సహకరిస్తున్న తల్లిదండ్రులు, శ్రేయోభిలాషులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మొన్న ఇంటర్ ఫలితాల్లో స్టేట్ టాప్ ర్యాంకులు, నిన్న జేఈఈ మెయిన్స్, జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో జాతీయస్థాయిలో టాప్ ర్యాంకులు, నేడు అదే పరంపరను కొనసాగిస్తూ.. నీట్‌లో సైతం జాతీయ స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించడం మాకు మరింత బాధ్యతను పెంచాయని డైరెక్టర్ తేజేశ్వర రెడ్డి తెలిపారు. అంతే కాకుండా మొన్న ప్రకటించిన జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో అఖిల రెడ్డి ఆల్ ఇండియా 217 ర్యాంక్, జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో భార్గవి ఆల్ ఇండియా 232, అఖిల 976 లాంటి అత్యుత్తమ ర్యాంక్ లు సాధించి జాతీయ స్థాయిలో సుమారు 30 మందికి పైగా ఐఐటీ, ఎన్ఐటీ, ఐఐఐటీ, జీఐఎఫ్‌టీ లాంటి ప్రముఖ కాలేజీలలో సీట్లు సాధించారని తెలిపారు. విద్యాసంస్థల చైర్‌పర్సన్ ఉమాదేవి మాట్లాడుతూ.. కళాశాల స్థాపించిన మూడేళ్లలోనే తమ విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ చూపడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థుల కృషి, నిష్ణాతులైన అధ్యాపకుల బోధన కారణంగానే తమ కళాశాలకు ఇంతటి విజయం సాధ్యమైందన్నారు. భవిష్యత్తులోను మరింత మెరుగైన ఫలితాలు సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. తమ కళాశాలపై నమ్మకం ఉంచిన విద్యార్థుల తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. అకడమిక్ డైరెక్టర్ అనిల్ కుమార్ మాట్లాడుతూ.. దశాబ్దాల చరిత్ర కలిగి, వందల బ్రాంచులతో వేలాది మంది విద్యార్థులతో, లక్షల ఫీజులు కట్టించుకొని సాధించలేనిది, సాధారణ విద్యార్థులతో, స్థాపించిన మొదటి 3 సంవత్సరాలలో వరుసగా టాప్ ర్యాంక్‌లను ఒకేచోట నుంచి సాధించి తేజ విద్యాసంస్థ చరిత్ర తిరగరాసిందన్నారు. మరో డైరెక్టర్ ఆదర్శ్ మాట్లాడుతూ.. 2025లో కూడా జేఈఈ అడ్వాన్స్‌లో 81, జేఈఈ మెయిన్స్‌లో 151, నీట్‌లో 1872 లాంటి ఆల్ ఇండియా ర్యాంకులను కూడా సాధించి పోటీ ప్రపంచంలో తేజ జూనియర్ కళాశాల అగ్రగామిగా నిలిచిందన్నారు. అత్యుత్తమ ఫలితాలు సాధించడం పట్ల తేజ విద్యాసంస్థల డైరెక్టర్ తేజేశ్వర్ రెడ్డి, చైర్‌పర్సన్ ఉమాదేవి, సీఈఓ అనిల్ కుమార్, అకాడమిక్ డైరెక్టర్లు సాయి చైతన్య, నేత్ర వాణి, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్లు రాజశేఖర్ రెడ్డి, సోమశేఖర్ రెడ్డి, వెంకటేష్‌రెడ్డి, ప్రిన్సిపల్స్ పెద్దిరెడ్డి, ఫాతిమాలు విద్యార్థులను అభినందించారు. తమ పిల్లలు అత్యుత్తమ మార్కులు సాధించడం పట్ల తల్లిదండ్రులు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ విద్యాసంస్థల అధ్యాపక బృందాన్ని యాజమాన్య కృషిని కొనియాడారు.

### కళాశాలలో మిన్నంటిన సంబరాలు:

ఫలితాలు విడుదలైన వెంటనే తేజ కళాశాల ఆవరణలో పండుగ వాతావరణం నెలకొంది. టాపర్లుగా నిలిచిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను కళాశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. విద్యార్థులు మిఠాయిలు పంచుకుంటూ తమ సంతోషాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా టాపర్లు మాట్లాడుతూ.. కళాశాల యాజమాన్యం అందించిన ఒత్తిడి లేని చదువు, అధ్యాపకుల ప్రత్యేక శ్రద్ధ వల్ల ఈ ఫలితాలు సాధించామని సంతోషం వ్యక్తం చేశారు.

# యాకర్లకుంటపల్లిలో సేంద్రీయ వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం

ముదిగుబ్బ,జులై 18, అనంత సూర్య: ముదిగుబ్బ మండలం యాకర్లకుంటపల్లిలో వర్షాభావ పరిస్థితులను అధిగమించడానికి సేంద్రియ వ్యవసాయ పద్ధతులను వ్యవసాయ రైతులు అవలంబించాలని ముదిగుబ్బ మండల ప్రత్యేక అధికారి జనార్దన్ రావు సూచించారు శనివారం యాకర్లకుంటపల్లి గ్రామంలో రైతులకు ఆరుతడి పంటలు మరియు (పిఎండి ఎస్) పై వ్యవసాయ అధికారులు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షా బావ పరిస్థితి దృష్ట్యా ప్రతి రైతు తాను వేసి పంట విత్తనాలను విత్తన గుళికలు చేసుకొని వర్షం కోసం ఎదురు చూడకుండా వెంటనే పొలంలో విత్తనాలు విత్తుకోవాలని తెలిపారు కొద్దిపాటి వర్షం వచ్చిన వెంటనే విత్తనం ఆరోగ్యంగా మొలకెత్తుతుందని అన్నారు ఇతర పంటల విత్తనాలు కూడా విత్తన గుళికలు చేసుకొని పంటలు సాగు చేపట్టాలని తెలిపారు వరి పంట బదులు ఆరుతడి పంటలు సాగు చేయాలని సూచించారు రసాయనక ఎరువులు వాడకం తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకం చేపట్టాలని తెలిపారు ఈ కార్యక్రమంలో ముదిగుబ్బ మండల ఎంపీడీవో షేక్ ఖాజావలి ముదిగుబ్బ మండల వ్యవసాయ అధికారి పి రవీంద్ర పకృతి వ్యవసాయ విభాగం మండల కోఆర్డినేటర్ పెద్దన్న ఎఫ్ ఎమ్ టి కృష్ణవేణి వ్యవసాయ సిబ్బంది అంజిబాబు ప్రియాంక నాగరాజు పకృతి వ్యవసాయ సిబ్బంది రైతులు తదితరులు పాల్గొన్నారు.

# చెక్ బౌన్స్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక లోక్ అదాలత్




- **47 కేసుల పరిష్కారం.. రూ.36.62 లక్షల మేర రాజీ**

అనంతపురం, జులై 18 అనంత సూర్య: అనంతపురం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఉమ్మడి అనంతపురం జిల్లాలోని అన్ని కోర్టు ప్రాంగణాల్లో చెక్ బౌన్స్ కేసుల పరిష్కారానికి ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రధాన జిల్లా న్యాయమూర్తి ఈ. భీమారావు తెలిపిన వివరాల ప్రకారం, నిర్వహించిన ప్రత్యేక లోక్ అదాలత్‌లో మొత్తం 47 చెక్ బౌన్స్ కేసులు రాజీ ద్వారా పరిష్కారమై రూ.36.62 లక్షల మేర పరిష్కారం జరిగింది. అనంతపురం కోర్టు ప్రాంగణంలో మూడు ప్రత్యేక బెంచీలను ఏర్పాటు చేశారు. తొలి బెంచ్‌లో పర్మినెంట్ లోక్ అదాలత్ చైర్మన్ శైలజాదేవి, ప్రథమ స్పెషల్ మేజిస్ట్రేట్ శివశంకర్, ద్వితీయ స్పెషల్ మేజిస్ట్రేట్ సుబ్బారావు సేవలందించారు. చెక్ బౌన్స్ కేసులను పరస్పర రాజీ ద్వారా త్వరితగతిన పరిష్కరించుకోవడానికి లోక్ అదాలత్‌లు ఉత్తమ వేదికగా ఉపయోగించుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఈ. భీమారావు ప్రజలకు సూచించారు.

# ప్రజలపై చెత్త పన్ను వేసి.. 85 లక్షల టన్నుల చెత్త వదిలారు: ఎమ్మెల్యే దగ్గుపాటి



అనంతపురం, జులై 18 అనంత సూర్య: గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రజలపై చెత్త పన్ను విధించి 85 లక్షల టన్నుల చెత్తను పేరుకుపోయేలా చేశారని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ విమర్శించారు. స్వర్ణాంధ్ర--స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్‌లో బల్క్ వ్యర్థాల నిర్వహణపై హోటళ్లు, ఆసుపత్రులు, విద్యాసంస్థలు, కల్యాణ మండపాల నిర్వాహకులతో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. తడి, పొడి, శానిటరీ వ్యర్థాలను వేర్వేరుగా నిర్వహించాలని, ఆస్పత్రి వ్యర్థాలను నిబంధనలకు విరుద్ధంగా పారవేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతపురం డంపింగ్ యార్డులో పేరుకుపోయిన చెత్తలో అధిక భాగాన్ని ఇప్పటికే తొలగించామని, త్వరలో అక్కడ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్‌తో పాటు పార్కును ఏర్పాటు చేస్తామని తెలిపారు. నగరంలో మూడు దశాబ్దాలుగా ఉన్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్ జస్వంత్ కుమార్ మాట్లాడుతూ ప్లాస్టిక్ నిర్మూలన, ఆక్రమణల తొలగింపుపై ప్రత్యేక దృష్టి సారించామని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్ఓ రాజా రవీంద్ర, కాలుష్య నియంత్రణ మండలి అధికారి శశికళ, ప్రజాప్రతినిధులు, అధికారులు, వ్యాపార సంస్థల నిర్వాహకులు పాల్గొన్నారు.

# పార్శిల్స్ కు అత్యుత్తమ రవాణ సేవలందించే ఆర్టీసీ కార్గో సర్వీసులకు కస్టమర్లు సద్వినియోగం చేసుకోండి




**ఆర్టీసీ లాజిస్టిక్ సర్వీసులపై కస్టమర్లకు వివరణ ఇచ్చిన డిపో మేనేజర్**

కదిరి,జులై18,అనంత సూర్య: కదిరి డిపో నందు నడపబడుచున్న లాజిస్టిక్ మరియు పార్శిల్స్ సర్వీసుల పైన కస్టమర్లయొక్క సందేహం లకు కదిరి డిపో మేనేజరు జి.రమణయ్య వివరణ ఇచ్చినారు. శనివారం కదిరి బస్టాండు నందు అసిస్టెంట్ ఇంజనీరు రామకృష్ణ,కార్గో మార్కెటింగ్ సూపర్వైజరు శ్రీనివాసులతో కలసి ఈ కార్యక్రమం నిర్వహించినారు. కస్టమర్లు కిషోర్,ప్రదీప్, ఇర్షాన్ తదితరులతో మాట్లాడి,వారి సమస్యలను పరిష్కరించినారు. కార్గో పార్శిల్స్, కొరియర్స్, బల్క్ రవాణ బుక్ చేసిన 24 గంటలలోపు డెలివరీ చేస్తామని డిపో మేనేజరు తెలిపారు. పార్శిల్స్ కు అత్యుత్తమ రవాణ సేవలందించే ఆర్టీసీ కార్గో సర్వీసులకు కస్టమర్లు సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజరు రమణయ్య తెలిపారు. ఈ సందర్భముగా కార్గో సర్వీసులు,పార్శిల్ సర్వీసులపైన వివరణతో కూడిన కరపత్రములను విడుదల చేసినారు. ఈ కార్యక్రమములో యూనియన్ నాయకులు బైరిశెట్టి, సిబ్బంది రవికుమార్, ఎం.ఎన్.రెడ్డి,కార్గో సిబ్బంది ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

Editor, Published and Owned by C Hari Krishna, Published from D.no 1-3-780, Rajaka Nagar, Anantapur - 515001, Printed from NALIVELI EXPRESS PRINTERS Hno. 1-1A9T-10, Main Road, Pattikonda, Kurnool 518380, EDITOR : C HARI KRISHNA" Mobile number: 9182495405